# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 07-05-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ కలిసి కట్టుగా పని చేస్తే ప్రభుత్వం మరింత విజయవంతంగా ప్రజలకు సేవలందించగలదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు స్పష్టం చేశారు.

- ❖ కలెక్టర్లు తమ జిల్లాల భవిష్యత్ దృష్ట్యా దీర్ఘకాలిక దృష్టితో పని చేయాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు.

- ❖ భూ రికార్డులు తారుమారు చేయడానికి ఎటువంటి ఆస్కారం లేకుండా భూయజమానులకు ఈ-కెవైసీ సదుపాయం కల్పించామని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు.

- ❖ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రాబోయే రెండు రోజుల పాటు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది.

==========================

కలిసి కట్టుగా పని చేస్తే ప్రభుత్వం మరింత విజయవంతంగా సేవలు అందించగలదని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్లకు స్పష్టం చేశారు. సమిష్టి కృషితోనే అభివృద్ధి జరుగుతుందని, నేను అని కాకుండా.. మనం అనే ఆలోచన విధానం అందరిలో రావాలని చెప్పారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జరిగిన 7వ కలెక్టర్ల కాన్ఫరెన్సులో వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా జీఎస్డీపీ గ్రోత్, జిల్లాల వారీగా జీఎస్డీపీ అంచనాలు, సింగపూర్ దేశంలో మంత్రులకు ట్రైనింగ్ వంటి అంశాలపై చర్చ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... నేర్చుకోవటం అనేది నిరంతర ప్రక్రియ అని, అత్యుత్తమ విధానాలు ఎక్కడున్నా అమలు చేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. సింగపూర్ దేశంలో అనుసరిస్తున్న పాలనా విధానాలు అక్కడి ప్రజల విశ్వాసాన్ని దక్కించుకున్నాయని చెప్పారు. జీఎస్డీపీ విషయంలో తీసుకునే నిర్ణయాలు భవిష్యత్‌లో ప్రజలపై ప్రభావం చూపిస్తాయన్నారు. అభివృద్ధిపై దృష్టి సారించాలని, ప్రగతి సాధనలో కీలకంగా వ్యవహరించాలని, సేవారంగం మరింతగా పెరగాలని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ... ఫలితాలే లక్ష్యంగా పని చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్లకు దిశా నిర్దేశం చేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

===========================

అమరావతిలో జరుగుతున్న 7వ కలెక్టర్ల సదస్సులో వైద్యారోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఇటీవల తన సహచర మంత్రులతో చేసిన సింగపూర్ పర్యటన అనుభవాలను ఈరోజు పంచుకున్నారు. సింగపూర్ - ఆంధ్రప్రదేశ్ గవర్నెన్స్ ఎక్సలెన్స్ (SAGE) కార్యక్రమం గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. సింగపూర్ చాలా చిన్న దేశమైనప్పటికీ ఆ దేశం ప్రపంచంలో మొదటి వరుసలో ఉంటోందన్నారు. ఎందుకంటే అక్కడి పాలకులకు స్పష్టమైన లక్ష్యాలు ఉన్నాయని, బాధ్యత తీసుకునే నాయకత్వం, ప్రజలకు సేవ చేయాలనే తపన, చిత్తశుద్ధి వారిలో ఉన్నాయని చెప్పారు. ఈ మూడు అంశాలే సింగపూర్‌ను మిగతా దేశాల నుంచి వేరు చేస్తున్నాయని అన్నారు. అక్కడ పట్టణ ప్రణాళికలు చాలా ముందు చూపుతో ఉన్నాయని, ఒక స్పష్టమైన భవిష్యత్ కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని చెప్పారు. అధికారులందరూ సమన్వయంతో క్షేత్రస్థాయి పరిస్థితులను విశ్లేషించుకుంటూ పని చేస్తున్నారని తెలిపారు. మన జిల్లాల్లో కూడా కలెక్టర్లు అదే దీర్ఘకాలిక దృష్టితో పని చేయాలని, రోజువారీ సమస్యలు పరిష్కరించడం మాత్రమే కాకుండా పదేళ్ళ తర్వాత జిల్లా ఎలా ఉండాలో నిర్ణయించుకొని ఆ దిశగా పని చేయాలని సత్యకుమార్ యాదవ్ సూచిస్తూ...

(వాయిస్ 25 సెకన్లు)

===========================

బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ – 2025 అవార్డు సాధించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కలెక్టర్ల సదస్సు అభినందనలు తెలిపింది. ఈ ఉదయం అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రారంభమైన కలెక్టర్ల సదస్సుకి హాజరైన చంద్రబాబు నాయుడుకు మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు స్టాండింగ్ ఓవేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుండి మొదలుకుని, గ్రామ స్థాయి అధికారి వరకు కలిసి పని చేయడం వల్లే ఈ అవార్డు దక్కిందని చెప్పారు. గతంలో ఇలాంటి అవార్డులు తీసుకోవడానికి ఇష్టపడేవాడిని కాదని.. కానీ ఇప్పుడు ఇలాంటి అవార్డులు మరిన్ని రావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఎన్ని అవార్డులు వస్తే రాష్ట్రానికి అంత గుర్తింపు దక్కుతుందని, మరిన్ని పెట్టుబడులు వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఒక సమిష్టి జట్టుగా పని చేస్తున్న మీ అందరికీ ఈ అవార్డును అంకితం చేస్తున్నానని పేర్కొన్నారు.

విరామం

===========================

భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ "ఒక నెల – ఒక గ్రామం – నాలుగు దఫాల సందర్శన" పేరిట రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. అందులో భాగంగా జిల్లాలో ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందని తూర్పు గోదావరి జిల్లా సంయుక్త కలెక్టర్ వై. మేఘా స్వరూప్ ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ స్థాయిలోనే భూ సంబంధిత సమస్యలను పరిష్కరించి రైతులు, భూ యజమానులకు త్వరితగతిన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి నెలలో నాలుగు గురువారాలు అధికారుల బృందం గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను స్వీకరించి పరిష్కార దిశగా చర్యలు చేపడుతుందని తెలియజేశారు.

===========================

ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం సందర్భంగా 'మీ ఇంటికి – మీ డాక్టర్' ప్రాజెక్టును రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ ఈరోజు ప్రారంభించారు. లోక్‌భవన్‌లో జరిగిన ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవం, ప్రపంచ తలసేమియా దినోత్సవ కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అంతర్జాతీయ రెడ్ క్రాస్, రెడ్ క్రెసెంట్ ఉద్యమం ద్వారా అత్యవసర పరిస్థితులు, విపత్తుల సమయంలో ప్రజలకు అవసరమైన నిత్యావసర సేవలను అందించే

వాలంటీర్ల అవిశ్రాంత కృషిని గౌరవించడానికి రెడ్ క్రాస్ దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా పాటిస్తారని చెప్పారు. మానవత్వంపై ఆధారపడిన ఈ ఉద్యమ సూత్రాల గురించి అవగాహన పెంచడానికి కూడా ఈ రోజు ఒక అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. రెడ్ క్రెసెంట్ ఉద్యమ వ్యవస్థాపకుడైన జీన్ హెన్రీ డ్యూనాంట్ జయంతిని పురస్కరించుకుని ఏటా ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ ఉద్యమానికి ఆయన చేసిన సేవలకుగాను 1901లో ఆయనకు మొట్టమొదటి నోబెల్ శాంతి బహుమతి లభించింది.

===========================

గత రెండేళ్ల కాలంలో రెవెన్యూ వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువచ్చామని ఆ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. భూ రికార్డులు తారుమారు చేయడానికి ఎటువంటి ఆస్కారం లేకుండా ప్రతి దశలోనూ భూ యజమానికి ఈ-కెవైసీ సదుపాయం కల్పించామన్నారు. కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ఆయన ఈరోజు మాట్లాడుతూ... పట్టణ గరిష్ఠ భూ పరిమితి చట్టం కింద నిషేధ జాబితాలో ఉన్న స్థలాల క్రమబద్ధీకరణ గడువు తేదీని ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు పొడిగిస్తున్నామన్నారు. క్రమబద్ధికరణ ప్రక్రియను కూడా సులభతరం చేశామని, గతంలో ప్రభుత్వం వద్దకు రావాల్సి ఉండగా ప్రస్తుతం సీసీఎల్ఏ స్థాయిలోనే ఆదేశాలు ఇచ్చే విధంగా సవరణ చేశామన్నారు. విలేజ్ సర్వీసు ఇనాం భూములను 22ఎ నిషేధిత జాబితా నుండి తొలగిస్తూ.. లక్షా 36 వేల ఎకరాలకు విముక్తి కల్పించామన్నారు. పట్టా భూముల 1బి, అడంగల్ ను ఆన్‌లైన్‌లో భూ యజమానులే స్వంతంగా లాక్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు. భూ యజమానుల అనుమతి లేకుండా ఏ అధికారి కూడా మ్యుటేషన్లు గానీ, రిజిస్ట్రేషన్లు గానీ చేసే అవకాశం ఉండదన్నారు. కొత్త పాస్ బుక్ కూడా ఈ-కేవైసీ చేసి డ్రాఫ్ట్ పాస్ పుస్తకాన్ని రైతులకు చూపించి వారు సంతృప్తి చెందిన తర్వాతే ముద్రణకు పంపిస్తున్నామని మంత్రి వివరిస్తూ...

(వాయిస్ 22 సెకన్లు)

===========================

దేశంలో స్వయం సహాయక సంఘాలకు ఈ ఆర్థిక సంవత్సరంలో 35 వేల కోట్ల రూపాయల విలువైన రుణాలు ఇవ్వడం జరిగిందని, బ్యాంక్ లింకేజ్ రుణాల మంజూరులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచిందని రాష్ట్ర స్త్రీ నిధి మేనేజింగ్ డైరెక్టర్ జి.వి.బి.డి. హరిప్రసాద్ చెప్పారు. శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈరోజు జరిగిన ఉత్తరాంధ్ర జిల్లాల స్వయం సహాయక సంఘాల ప్రతినిధుల సమావేశంలో 2026-27 సంవత్సరానికి గాను వార్షిక రుణం, జీవనోపాధి ప్రణాళికపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో స్త్రీ నిధి ప్రాజెక్ట్ ద్వారా 6 వేల కోట్ల రూపాయల రుణాలు ఇవ్వాలని ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలియజేశారు.

===========================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో ఆగ్నేయ, నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని.. వీటి ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో రెండు రోజుల పాటు పిడుగులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. అల్లూరి సీతారామరాజు, పోలవరం, విశాఖ, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో రేపు అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. అదే విధంగా ఈదురు గాలులు గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశముందని హెచ్చరించారు.

===========================
===========================